జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజా జ్యోతి
ప్రతి అక్షరం - ప్రజాల కోసం
నిజామాబాద్
బుధవారం 11 డిసెంబర్ 2024 www.prajajyothinews.com పేజీలు :04

## ఆర్మూర్ ఏసీపీని మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్మూర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బైండ్ల ప్రశాంత్



**ప్రజాజ్యోతి నిజామాబాద్ ప్రతినిధి:** ఆర్మూర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బైండ్ల ప్రశాంత్ ఆర్మూర్ ఏసీపీ శ్రీ వెంకటేశ్వర్ రెడ్డిని మంగళవారం మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా బైండ్ల ప్రశాంత్ మాట్లాడుతూ శాంతి భద్రతల పర్యవేక్షణ, డ్రగ్స్, గంజాయి నియంత్రణ, సమాజంలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా, యువజన నాయకులుగా ఎదగాలని యువతలో అవగాహన కల్పించాలని ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి తమకు సూచించినట్లు ఆయన తెలిపారు.

# లక్ష్యసాధన దిశగా కృషి చేయాలి

-




## జిల్లా కోర్టు ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జ్ శ్రీమతి సునీత



ప్రజాజ్యోతి నిజామాబాద్ బ్యూరో: విద్యార్థినులు ఉన్నత లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని ఆ దిశగా విద్యాభ్యాసం చేస్తూ సాదించాలని నిజామాబాద్ జిల్లా కోర్టు ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి శ్రీమతి సునీత కుంచాల అన్నారు. మంగళవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా నిజామాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జిల్లా న్యాయ సేవ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సమావేశానికి కళాశాల ప్రిన్సిపల్ శ్రీ బుద్దిరాజు అధ్యక్షత వహించగా, అతిథిగా జిల్లా ఇంటర్ విద్య అధికారి శ్రీ తిరుమలపుడి రవికుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కోర్టు ప్రిన్సిపల్ సేషన్స్ జడ్జి శ్రీమతి సునీత మాట్లాడుతూ విద్యార్థినులు విద్యను అభ్యసించడం తమ హక్కు అని, ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని ఆ దిశగా భవిష్యత్తు విద్యాభ్యాసాన్ని చేస్తూ తాను అనుకున్నది సాధించాలని ఉద్బోదించారు. ప్రతి మహిళా ఉన్నతంగా తమ జీవితాన్ని తీర్చిదిద్దుకోవడం విద్యార్థి దశనుండే అలవర్చుకోవాల్సి ఉంటుందని అన్నారు. అన్నిటికి మూలం విద్యాభ్యాసమేనని, ప్రస్తుతం కష్టపడి విద్య నేర్చుకోవడం పై ప్రత్యేక శ్రద్ధను కనబరచాలని అన్నారు. అన్ని రంగాలలో మహిళలు ముందు ఉండాలని, ఉచిత న్యాయ సహాయం కూడా పొందవచ్చు అని అన్నారు. జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి శ్రీమతి పద్మావతి మాట్లాడుతూ విద్యార్థి దశలోనే హక్కుల గురించి తెలుసుకోవాలని అన్ని విషయాలలో జిల్లా న్యాయ సేవా సంస్థ మహిళలకు హక్కుల పరిరక్షణ కోసం న్యాయ సేవ అందించేందుకు కృషి చేస్తుందని అన్నారు. ఏ అన్యాయం జరిగినా న్యాయ సేవా సంస్థ ఉచిత న్యాయ సహాయం చేస్తుందని అన్నారు. రాజ్యాంగం ప్రకారం ప్రతి ఒక్కరూ విద్యార్థి దశనుండే హక్కుల తో పాటు విధులను కూడా సక్రమంగా నిర్వర్తించాలని ఉద్బోధించారు. జిల్లా ఇంటర్ విద్య అధికారి శ్రీ తిరుమలపుడి రవికుమార్ మాట్లాడుతూ సమాజాభివృద్ధికి విద్యార్థి దశ నుండి బాధ్యతయుతంగా వ్యవహరించాలని అన్నారు. ప్రతి మహిళ, విద్యార్థినీ యీ అన్యాయం జరిగినా ఉచిత న్యాయ సహాయం పొందడానికి జిల్లా న్యాయ సేవా సంస్థ ను సంప్రదించాలని విద్యార్థినులకు సూచించారు. సమాజంలో ఉన్న రుగ్మతలను నిర్మూలించడానికి మహిళల పట్ల జరుగుతున్న అణచివేత, అకృత్యాలను, నిర్మూలించేందుకు విద్యార్థినులు, యువతులు జాగరూకతతో వ్యవహరించాలని ఉద్బోధించారు.ప్రిన్సిపాల్ శ్రీ బుద్దిరాజు మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులకు జిల్లా న్యాయ సేవ సంస్థ ఆధ్వర్యంలో ఆవగాహన కల్పించి హక్కులను పొందే విధంగా కృషి చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

## నిజాయతీ చాటుకున్న నిజామాబాద్ ట్రాఫిక్ పోలీసులు





## ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలి

### - రాజకీయ పార్టీలను కోరిన అదనపు కలెక్టర్ అంకిత్



# నిజాయతీ చాటుకున్న నిజామాబాద్ ట్రాఫిక్ పోలీసులు



**ప్రజాజ్యోతి నిజామాబాద్ క్రైమ్:** నిజామాబాద్ జిల్లా కేంద్రంలో విధి నిర్వహణలో ఉండగా దొరికిన బ్యాగును బాధితులకు అందజేసి నిజామాబాద్ ట్రాఫిక్ పోలీసులు నిజాయితీ చాటుకున్నారు. ఈ నెల 7 న జిల్లా కోర్టు చౌరస్తా లో ఓ వ్యక్తి మోటార్ సైకిల్ పై వెళ్తుండగా రూ 2000 విలువ గల నిత్యవసర సరకుల సంచి పడిపోగా అక్కడే విధులు నిర్వర్తిస్తున్న ట్రాఫిక్ పోలీసులకు లభించింది.వాటిని కమాండ్ అండ్ కంట్రోల్ సీసీ కెమెరాల ద్వారా పరిశీలించగా సంచిలో పాత బిల్ చిట్టి ద్వారా సదరు వ్యక్తి కి సమాచారం అందించారు. మంగళవారం బడుతునికి ట్రాఫిక్ సిఐ ప్రసాద్ దొరికిన బ్యాగును అందజేశారు.

# ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలి

**- రాజకీయ పార్టీలను కోరిన అదనపు కలెక్టర్ అంకిత్**








**ప్రజాజ్యోతి నిజామాబాద్ బ్యూరో:** నిజామాబాద్, డిసెంబర్ 10 : స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా రూపొందించిన ముసాయిదా పోలింగ్ స్టేషన్ల జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 12 వ తేదీ లోపు తెలియజేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అంకిత్ రాజకీయ పార్టీలను కోరారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన ఛాంబర్లో మంగళవారం ఆయన గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కలెక్టర్ పర్యవేక్షణలో ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితాను రూపొందించడం జరిగిందన్నారు. ఇప్పటికే ఈ నెల 7 వ తేదీన జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామ పంచాయతీలలో ముసాయిదా జాబితాను ప్రకటించామని గుర్తు చేశారు. జిల్లాలో మొత్తం 545 గ్రామ పంచాయతీలు, 5022 వార్డులు ఉండగా, రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరిస్తూ 5053 పోలింగ్ కేంద్రాలను గుర్తిస్తూ ముసాయిదా జాబితాను రూపొందించామని వివరించారు. ఆర్మూర్ డివిజన్ పరిధిలో 180 జీపీలు, 1766 వార్డులకు గాను 1786 పోలింగ్ కేంద్రాలు, బోధన్ డివిజన్ పరిధిలో 152 జీపీలు, 1354 వార్డులకు గాను 1354 పోలింగ్ కేంద్రాలు, నిజామాబాద్ డివిజన్ పరిధిలో 213 జీ.పీలు, 1902 వార్డులకు గాను 1913 పోలింగ్ కేంద్రాలను ముసాయిదా జాబితాలో పొందుపర్చడం జరిగిందని వివరించారు. ఈ ముసాయిదా జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే ఈ నెల 12 వ తేదీలోపు తెలుపవచ్చని, 12న అన్ని మండలాల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎంపీడీఓలు నిర్వహించే సమావేశంలోనూ అభ్యంతరాలు స్వీకరిస్తారని అదనపు కలెక్టర్ తెలిపారు. వచ్చిన అభ్యంతరాలను 13వ తేదీన పరిష్కరించడం జరుగుతుందని, జిల్లా పాలనాధికారి ఆమోదం అనంతరం ఈ నెల 17న అన్ని మండలాలు, గ్రామ పంచాయతీలలో తుది పోలింగ్ కేంద్రాల జాబితా ప్రకటించబడుతుందని అన్నారు. ఈ సమావేశంలో ఇంచార్జ్ డీపీఓ శ్రీనివాస్, ఆర్మూర్ ఆర్డీఓ రాజాగౌడ్, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం



**ప్రజాజ్యోతి నిజామాబాద్ బ్యూరో :** నగరంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయం లో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి రూపు రేఖలు మార్చి తెలంగాణ సచివాలయం లో ప్రతిష్టించినందుకు గానూ నిరసనగా తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేసి పూల మాల వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినప్పుడల్లా తలరాతలు మారాలి తప్ప తల్లులను మార్చడం అతిపెద్ద తప్పు అని మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్ అన్నారు. ప్రభుత్వం మారితే తెలుగు తల్లి మారిందా?కాంగ్రెస్ నుంచి బిజెపి వస్తే భారతమాత మారిందా? చెప్పాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వ విధి విధానాలను దుయ్యబట్టారు.అనంతరం నగర మేయర్ దండు నీతూ కిరణ్ విలేకరులతో మాట్లాడుతూ బతుకమ్మను మాయం చేయడం తెలంగాణ అస్తిత్వం పై జరుగుతున్న దాడికి పరాకాష్ట అని, యావత్ జాతికి జాగృతిపరచిన తెలంగాణ తల్లి ఒక పార్టీకో,వ్యక్తికో సంబంధించినది కాదన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఆస్తిత్వానికి చిహ్నాలు అయిన బతుకమ్మను,బతుకమ్మ చీరలను,బతుకమ్మ ఆటపాటలను చెరిపి, రానున్న రోజుల్లో తెలంగాణను మాయం చేసే కుట్రలకు పాల్పడుతుందని ఆరోపించారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ జడ్పీ చైర్మన్ దాదన్న గారి విఠల్ రావు, సీనియర్ నాయకులు సుదాం రవి చందర్,సత్య ప్రకాష్,సుజిత్ సింగ్ ఠాకూర్,నవీద్ ఇక్బాల్,తెలంగాణ శంకర్,శేఖర్ రాజు,మీసాల శంకర్,చింతకాయల రాజు,ఎండల ప్రసాద్,మాకు రవి,జమాల్పూర్ రమేష్,అనిల్,ప్యాట సంతోష్, మహేందర్, విజయ్, సాదిక్,తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

**జిల్లా ఇంటర్ విద్యాధికారి తిరుమలపుడి రవికుమార్**



**ప్రజాజ్యోతి నిజామాబాద్ బ్యూరో:** రాష్ట్ర ఇంటర్ బోర్డు కమిషనర్ ఆదేశాల మేరకు నిబంధనలను అతిక్రమించిన ఏ కళాశాలపై అయిన కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఇంటర్ విద్యాధికారి తిరుమలపూడి రవికుమార్ అన్నారు. మంగళవారం జిల్లా ఇంటర్ విద్య అధికారి నిజామాబాద్ పట్టణంలోని వినాయక్ నగర్ లో ఉన్న ఎస్.ఆర్. ప్రైవేట్ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణ తో పాటు తరగతి గదులను,ప్రయోగశాలలను,కనీస అవసరాల కల్పనపై పర్యవేక్షణ చేశారు. కళాశాల లో నియమ నిబంధనల ప్రకారం ఫైళ్ళ నిర్వహణ,పాలనాపరమైన అనుమతులు,పరీక్ష ఫీజుల వసూలు,ఇతర అన్ని రిజిస్టర్ లను తనిఖీ చేశారు ఈ సందర్భంగా ప్రిన్సిపల్,సిబ్బంది,అధ్యాపకులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ సూచించిన మేరకు ప్రణాళిక బద్దంగా నిర్వహణ జరగాలని ఆదేశించారు. ఏ విధమైన నిర్వహణ లోపాలున్న శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.

# సిలబస్ పూర్తి చేసి రివిజన్ చేయాలి

**ప్రిన్సిపల్స్ ల సమావేశంలో జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్**



**ప్రజాజ్యోతి నిజామాబాద్ బ్యూరో:** సిలబస్ పూర్తి చేసి వెంటనే రివిజన్ ప్రారంభించాలని జిల్లా ఇంటర్ విద్య అధికారి తిరుమలపుడి రవికుమార్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్ లను ఆదేశించారు. మంగళవారం జిల్లా ఇంటర్ విద్య కార్యాలయంలో జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్ ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పై ప్రత్యేక దృష్టి సారించే విధంగా అధ్యాపకులను సంసిద్ధం చేయడంతో పాటు వంద శాతం ఉత్తీర్ణత కోసం కృషి చేయాలని ఆదేశించారు. సిలబస్ రివిజన్ చేయడంతో పాటు ప్రతి సైన్స్ విద్యార్థి కి ప్రయోగశాలలో తగిన శిక్షణ ఇవ్వాలని అన్నారు. శిక్షణకు అవసరమయ్యే ముడి పదార్థాలను కొనుగోలు చేసేందుకు గాను ఇంటర్ బోర్డు డబ్బులు సమకూర్చుతోందని అన్నారు. 90 రోజుల ప్రణాళికను కచ్చితంగా అధ్యాపకులు అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఇంటర్ విద్యా అధికారి ప్రిన్సిపాల్ లను ఆదేశించారు. కళాశాల లాగిన్లలో విద్యార్థుల సమాచారం మార్పులు చేర్పులు చేయడానికి మరో అవకాశం ఉందని, నామినల్ రోల్ లలో విద్యార్థుల సబ్జెక్టు చేంజ్, మీడియం చేంజ్,ఫోటో,సంతకము మార్పులు,చేర్పులు చేయడానికి మరో అవకాశం కల్పించడం జరిగిందని అన్నారు. అవసరమైన విద్యార్థుల సమాచారాన్ని వెంటనే సరిదిద్దాలని అన్నారు. ఈ సమాచారాన్ని వెంటనే విద్యార్థులకు చేరవేసి సరైన సమాచారాన్ని క్రోడీకరించి కంప్యూటర్లలో నిక్షిప్తం చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ లను ఆదేశించారు. కళాశాల కార్యాలయ సిబ్బంది అన్ని రిజిస్టర్ లను పూర్తి చేసెలా ప్రతి విషయంపై ప్రిన్సిపాల్ లు ప్రత్యేక శ్రద్ధ వహించి స్వయంగా పర్యవేక్షించాలని జిల్లా ఇంటర్ విద్యా అధికారి ప్రిన్సిపాల్ లను ఆదేశించారు. అలాగే విద్యార్థులలో యాంటీ డ్రగ్స్ విషయంపై అవగాహన సదస్సులు నిర్వహించాలని,అలాగే విద్యార్థులలో మానసిక స్థైర్యాన్ని పెంపొందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. అవసరమైన వారికి మానసికంగా సంసిద్ధులం చేసేందుకు టేలిమానాస్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి కళాశాలలో తాను ఆకస్మిక తనిఖీలు చేసి నివేదికలను రూపొందిస్తున్నామని అన్నారు. జిల్లా ఇంటర్ బోర్డు కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతి కళాశాలలో ప్రణాళికబద్ధంగా పనిచేయడంతో పాటు అత్యధిక శాతం ఉత్తీర్ణతను సాధించేందుకు అధ్యాపకులను సంసిద్ధం చేయాలని ఇందుకు ప్రిన్సిపాల్ లు అధ్యాపకులు, సిబ్బంది పై తమ వ్యక్తిగత పర్యవేక్షణను పెంచాలని సూచించారు.

# కాంగ్రెస్ పార్టీలో .. ఎలాంటి విభేదాలు లేవు

**- ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి నాయకత్వంలోనే పనిచేస్తున్నాం - మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ గౌడ్**



**ప్రజాజ్యోతి నిజామాబాద్ ప్రతినిధి:** గత పది సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేకపోయినా మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా పనిచేశామని, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి నాయకత్వంలో పని చేస్తున్నామని మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ మా నాయకులు, కార్యకర్తలలో ఎలాంటి విభేదాలుగా లేవన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేకపోయినా మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి నాయకత్వంలో కలిసికట్టుగా పనిచేశామని, అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే ప్రజలతో మమేకమై ప్రభుత్వం ఇస్తున్న ఆరు గ్యారెంటీలను ప్రజలకు అందజేస్తున్నారన్నారు. కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు ఎవరి దగ్గర రూపాయి తీసుకోకుండా పనిచేస్తున్నామని ఎవరి దగ్గర డబ్బులు తీసుకున్నట్టు నిరూపిస్తే రాజకీయాల్లో నుంచి వైదొలగడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన విధానాలు ఇప్పుడు కూడా జరుగుతున్నాయని ఊహించుకొని అలా రాయడం బాధాకరమని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అలజడి సృష్టించాలానే ఉద్దేశంతోటి ఇలాంటి వార్తలు రాస్తున్నారని,రానున్న స్థానికకే సంస్థలు ఎన్నికలను కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు కలిసికట్టుగా పని చేసి విజయం సాధిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ గోవర్ధన్ రెడ్డి,రాజేందర్ కుమార్ గౌడ్,సాయిరెడ్డి,భగవాన్,విజయ్,నవీన్ రాజ్,బాల్ చందర్ గౌడ్,చామంతి రాజ్ తదితరులు పాల్గొన్నారు.



# నియంతపాలనకు అరెస్టులే నిదర్శనం



ఖలీల్‌వాడి, డిసెంబర్ 9 : రాష్ట్రంలో నియంత పాలన కొనసాగుతున్నదని, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సహా రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న అరెస్టులే అందుకు నిదర్శనమని నిజామాబాద్ జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసెంబ్లీకి వెళ్లకుండా పోలీసులతో అడ్డుకోవడం దారుణమన్నారు. తెలంగాణ తల్లి విగ్రహ మార్పు చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి పార్టీ నేతలు సోమవారం క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం విలేకరులతో విఠల్‌రావు మాట్లాడుతూ.. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ సర్పంచుల అక్రమ అరెస్టులను ఖండించారు. నిర్బంధాలతో బీఆర్ఎస్‌ను ఆపలేరని, తెలంగాణలో తమ ఉధృతిని తట్టుకోవడం కాంగ్రెస్ తరం కాదని హెచ్చరించారు.ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ నవంబర్ 29న ప్రారంభించిన ఆమరణ దీక్ష దేశం మొత్తాన్ని కుదిపేసిందన్నారు. దీంతో కేంద్రం దిగివచ్చి, రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నామని ప్రకటించిందన్నారు. రాష్ట్ర అవతరణకు పునాది వేసిన డిసెంబర్ 9వ తేదీని విజయ్ దివస్‌గా జరుపుకుంటున్నామని తెలిపారు. కేసీఆర్ మహోన్నత దీక్షాబలాన్ని, అమరుల త్యాగఫలాన్ని సగర్వంగా స్మరించుకుందామని పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ నేతలు సత్యప్రకాశ్, శంకర్, రాజు, ఫయీం ఖురేషి, శంకర్, భూపతి, మల్లేశం, విజయ్, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రి భవనం పైనుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య



**ప్రజాజ్యోతి నిజామాబాద్ ప్రతినిధి:** నిజామాబాద్ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. నగరంలోని నాగారం ప్రాంతానికి చెందిన మట్ల లక్ష్మణ్(50) అనే వ్యక్తి ఆసుపత్రిలోని ఆరో అంతస్తు పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇటీవల చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రిలో చేరిన లక్ష్మణ్ మానసికంగా ఆందోళనకు గురయ్యాడు. ఇదే క్రమంలో మంగళవారం ఆస్పత్రి పై అంతస్తు నుంచి ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికుల ద్వారా తెలిసింది.

# తలసేమియా పిల్లలకు న్యూట్రిన్ కిట్స్ పంపిణీ



**ప్రజాజ్యోతి నిజామాబాద్ ప్రతినిధి:** తలసేమియా వ్యాధితో బాధపడుతున్న పిల్లలకు మంగళవాం నగరంలోని రెడ్ క్రాస్ లో గల తలసేమియా వార్డులో న్యూట్రిన్ కిట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రాజశ్రీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె న్యూట్రిన్ కిట్లను పంపిణీ చేశారు. ఇందుకు సహకరించిన న్యూట్రిన్ కిట్స్ దాత జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ జోన్ 12 అధికారి జిల్కర్ నయన్ ,అన్నదాన దాత ఇందూర్ మదర్ హుడ్ ఆసుపత్రి గైనకాలజిస్ట్ డా. కరిపే తేజస్వి,ఎం.డి. కరిపే అక్షయ్ ని అభినందించారు. అలాగే రెడ్ క్రాస్ చేపడుతున్న రక్త దాన శిబిరాలు,ఎన్నో సేవ కార్యక్రమాలను కొనియాడారు. యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చెయ్యాలని పిలుపునిచ్చారు. .ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా ఛైర్మన్ బుస్స ఆంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోట రాజశేఖర్,కోశాధికారి కరిపే రవీందర్,మోపాల్ మండల ఛైర్మన్ వెంకటేశ్వరులు, తలసీమియా మెడికల్ ఆఫీసర్ డా అశ్విన్ కుమార్ రెడ్డి,బ్లడ్ బ్యాంకు మెడికల్ ఆఫీసర్ డా.రాజేష్,పి.ఆర్.ఓ బి.రామకృష్ణ,సిబ్బంది పాల్గొన్నారు.

# మంచు దుప్పటి

ఎల్లారెడ్డి పట్టణంతోపాటు లింగంపేట మండల కేంద్రాన్ని సోమవారం ఉదయం దట్టమైన పొగమంచు కమ్మేసింది. ఉదయం 7.30 గంటలు అయినా సూర్యుడు మంచు దుప్పటి చాటునే ఉన్నాడు. పొగమంచు కారణంగా ఎల్లారెడ్డి ప్రధాన రహదారి కనిపించకపోవడంతో రెండు గంటల పాటు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. హెడ్‌లైట్ల వెలుతురులో నెమ్మదిగా ప్రయాణించాల్సి వచ్చింది. లింగంపేట మండల కేంద్రంతోపాటు చుట్టుపక్కల గ్రామాలను మంచు దుప్పటి కమ్మేసింది. ప్రకృతి ప్రేమికులు ఈ ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదించారు.

